క్లుప్తంగా

ఈత మొక్కలు నాటండి



ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు, గీత కార్మికులు

నారాయణఖేడ్: నిజాంపేట్‌లో ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ఎక్సైజ్ శాఖ, కల్లుగీత కార్మిక సంఘంల ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి, ఎస్‌ఐ కుమారస్వామి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్‌లు గీత కార్మికులతో కలిసి ఈత మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరూ ఈత మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నరసింహాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, సతీష్ గౌడ్, దుర్గాగౌడ్, సాయాగౌడ్ పాల్గొన్నారు.

అదనపు ఎస్పీకి శుభాకాంక్షల వెల్లువ



అదనపు ఎస్పీని కలిసిన రిటైర్డ్ పోలీస్ సంఘం సభ్యులు

సంగారెడ్డి జోన్: జిల్లా అదనపు ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ రఘునందన్ రావును జిల్లా రిటైర్డ్ పోలీస్ సంఘం సభ్యులు కలిశారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, జనరల్ సెక్రటరీ మహేష్, సభ్యులు ప్రభాకర్ రావు, సయ్యద్, జహంగీర్, ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న నగేష్ షెట్కార్

నారాయణఖేడ్: మండల పరిధిలోని చిల్కెపల్లికి చెందిన రాజెమ్మకు రూ.40 వేలు, పిప్రికి చెందిన కమలాబాయికి రూ.10 వేలు, కొత్తూరుకు చెందిన మాలన్‌బీకి రూ.35 వేల సీఎం సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు బుధవారం ఎంపీ సురేష్ షెట్కార్ స్వగృహంలో ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి, యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్, ఫయాజ్, సతీష్, రాజు పాల్గొన్నారు.

ఆర్డీఓను సన్మానించిన 'జాగో' నాయకులు



ఆర్డీఓను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: ఆర్డీఓగా పదవి బాధ్యతలు స్వీకరించిన దేవుజాను బుధవారం జాగో తెలంగాణ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జాగో తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు రాములు నేత పట్టణంలోని సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించినా ఆర్డీఓ దశలవారీగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు మాదినం శివప్రసాద్, ఫసియోద్దీన్, అరవింద్, దశరథ్ ఉన్నారు.

రింగురోడ్డుకు ఇరువైపులా స్తంభాల ఏర్పాటు



నారాయణఖేడ్: పట్టణం చుట్టూ ఫార్మేషన్‌తో నిర్మించిన రింగురోడ్డును త్వరలో సీసీరోడ్డుగా మార్చి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో రింగురోడ్డుకు ఇరువైపులా విద్యుత్తు దీపాల కోసం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో విద్యుత్తు స్తంభాల ఏర్పాటు పనులను బుధవారం ప్రారంభించారు. పట్టణ శివారులోని మనూరు క్రాస్‌రోడ్డు వద్ద 161బీ జాతీయ రహదారి నుంచి ఖేడ్-కంగ్టి, ఖేడ్-సిర్గాపూర్, ఖేడ్-కాంజీపూర్ రోడ్ల మీదుగా పట్టణ శివారులోని డీఎస్పీ కార్యాలయ సమీపంలోని నిజాంపేట-ఖేడ్-బీదర్ జాతీరహదారిని కలుపుతూ రింగురోడ్డును నిర్మించారు. అలాగే మనూరు క్రాస్‌రోడ్డు సమీపం నుంచి రోడ్డుకు ఇరుపక్క స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు.

పాహిమాం.. మాతా

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు దర్శనం



సదాశివపేటలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు భక్తులకు వివిధ రూపంలో దర్శనమిస్తున్నారు. ఇందులో భాగంగానే మూడో రోజు బుధవారం అమ్మవారిని అన్నపూర్ణ దేవి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు అభిషేకం, సామూహిక కుంకుమార్చన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కాగా, పలు ఆలయాల్లో నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



జహీరాబాద్ టౌన్: సిద్దేశ్వర ఆలయంలో..



సదాశివపేట: వాసవీ కన్యకాపరమేశ్వర ఆలయంలో..



జిన్నారం: భద్రకాళీ మాతా



మునిపల్లి: బుదేరాలో..



సంగారెడ్డి టౌన్: అన్నపూర్ణాదేవి అలంకరణలో..



రామచంద్రాపురంలో దుర్గామాత ఆలయంలో చిన్నారి నృత్య ప్రదర్శన

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

బసంత్‌పూర్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త వినోద్‌కుమార్, వ్యవసాయశాఖ అధికారులు

జహీరాబాద్ టౌన్: మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని బసంత్‌పూర్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారిణి లావణ్య తదితరులతో కలిసి సోయాబీన్, కంది, చెరకు పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు కొంతవరకు దెబ్బతిన్నాయన్నారు. పంట పొలాల్లో ఉన్న నీటిని బయటకు తీసేయాలన్నారు. అలాగే కంది పంటను మొజాయిక్, ఎండు తెగులు ఆశిస్తుందని, ట్రైకోడెర్మా, రసం పీల్చే పురుగులకు కోర్లిపైరిపాస్ పిచికారీ చేయాలన్నారు. పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను వివరించారు. ఆయన వెంట ఏఓ లావణ్య, ఏఈఓ వీరేందర్, రైతులు ఉన్నారు.

తండాల్లో గిరిజనుల క్షీరాభిషేకాలు



ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న శేరి తండావాసులు

నారాయణఖేడ్: మండలంలోని పలు తండాల్లో గిరిజనులు సీఎం, మంత్రితోపాటు ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకాలు నిర్వహించారు పట్టణ శివారులోని వెంకటాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలోని రాంరావు మహరాజ్ ట్రస్టు ఆలయం వద్ద బంజారా భవన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలకు శేరితండా, హనుమాన్‌ండా, మాద్వారండాల తోపాటు పలు తండాల్లో క్షీరాభిషేకాలు చేశారు.

కల్హేర్‌లో..

కల్హేర్(నారాయణఖేడ్): నారాయణఖేడ్‌లో బంజార భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు మండలంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుకారం, దేవదాస్, గోవింద్‌నాయక్, మశ్చేందర్, మాజీ సర్పంచ్ దీప్లనాయక్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిబిరం



జహీరాబాద్ టౌన్: శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో తెలంగాణ 33 బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్ల సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ మేరకు 600 మంది క్యాడెట్లకు వారం రోజుల పాటు శిక్షణ తీసుకున్నారు. ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి, లెఫ్టినెంట్ కల్నల్ రమేష్ శరిమల్, సుబేదార్ మేజర్లు రవిపూరి మాట్లాడుతూ క్యాడెట్లకు నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవ, జాతీయ ఐక్యత స్ఫూర్తి పెంచడం, డ్రిల్, ఆయుధ శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ రాములు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జమీల్, పాపన్నపేట ఏఎన్‌ఓ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్..

జోగిపేట(అందోల్): పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవంలో భాగంగా జాతీయ సేవా పథకం యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పండరి మాట్లాడుతూ వాలంటీర్‌లు స్వచ్ఛందంగా సేవ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల యూనిట్-1, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్, కళాశాల సీనియర్ అసిస్టెంట్ ప్రఫుల్ల కుమార్, ఆఫీస్ సబార్డినేట్ హరికృష్ణ, ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



జోగిపేట: కళాశాల ఆవరణలో శ్రమదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్



బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ గోపాల్ నిజాయితీని చాటుకున్నాడు. డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సులో తిరుపతి నుంచి సంగారెడ్డి డిపో బస్సులో ప్రయాణిస్తున్న సత్య రమ్య బంగారు నగలతో పాటు రూ.1.80 వేలు ఉన్న బ్యాగును బస్సులో మర్చిపోయారు. అయితే డ్రైవర్ గుర్తించి మేనేజర్‌కు తెలపడంతో బుధవారం సంబంధిత కుటుంబ సభ్యులకు బ్యాగును అందజేశారు. అనంతరం ఆర్టీసీ యాజమాన్యం తరపున డ్రైవర్‌ను అభినందించారు.

ఆదర్శ రైతుకు సన్మానం



రైతు నాగభూషణంను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండలంలోని దానంపల్లికి చెందిన రైతు నాగభూషణం ఆదర్శ రైతుగా ఎంపికయ్యాడు. ఈ మేరకు బుధవారం జోగిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బోదన్‌లోని కమ్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆదర్శ రైతు మహోత్సవ కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులను శాలువా, మెమోంటో, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఎల్‌సీఓఐ చైర్మన్ డాక్టర్ బాబురావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ అమరనాథ్ రావు, ప్రోగ్రాం చైర్మన్ శివన్నారాయణ, లయన్స్ క్లబ్ ఏరియా కోఆర్డినేటర్ ఆకుల రాంబాబు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిశేఖర్ రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఏపీఎం వంశీకృష్ణ

కల్హేర్(నారాయణఖేడ్): మహిళా సంఘాలను బలోపేతం చేయాలని ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ కోరారు. బుధవారం మండల కేంద్రంలో సమైక్యా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్, స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్తగా వృద్ధులు, దివ్యాంగులు, కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీబీఓ ఆడిటర్ నర్సప్ప, మండల సమైక్యా అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి రేణుక, సీసీలు రాములు, కల్పన, సమత, రాధిక, అకౌంటెంట్ శోభన్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



జహీరాబాద్ టౌన్: ఆచార్య కళాశాల విద్యార్థులు తయారు చేసిన భారీ బతుకమ్మలు



పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు



జహీరాబాద్ టౌన్: బతుకమ్మల ఎదుట ఆడిపాడుతున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్ బుధవారం కళాశాల విద్యార్థుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కరెస్పాండెంట్ గుత్త మాధవి, ప్రిన్సిపల్ డాక్టర్ చింతల హరికుమార్‌లు రంగు రంగుల పూలతో తయారు చేసిన బతుకమ్మలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, శ్రీకాంత్ షెట్కార్, స్వాతి ,తృప్తి, రేణుక, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐకేపీ మండల సమైక్యా ఆధ్వర్యంలో..

కల్హేర్(నారాయణఖేడ్): ఐకేపీ మండల సమైక్యా ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మ ఆడారు. ప్రతిభ కనబర్చిన మహిళలకు ఏపీఎం వంశీకృష్ణ అభినందించారు.



కల్హేర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సాంప్రదాయాలకు ప్రతీక ..

పటాన్‌చెరు టౌన్: స్థానిక డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ కిషన్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలో 'స్వచ్ఛతాహి సేవా' కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ కిషన్ 22 వార్డులో పర్యటించారు. అనంతరం స్వచ్ఛత అంశాలకు సంబంధించి స్థానికులకు అవగాహన కల్పించారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటో సిబ్బందికి వేరువేరు చెత్తబుట్టలో తడి, పొడి చెత్తను అందించాలన్నారు. బహిరంగ ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి**

మునిపల్లి(అందోల్): పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సీడీపీఓ చంద్రకళ కోరారు. బుధవారం మండలంలోని బుదేరా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పిల్లల తల్లులతో బతుకమ్మ ఆట ఆడారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ నాగమణి, శైలజ, ఆయా గ్రామాల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **మెరుగైన సేవలు అందించాలి**

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతన బ్యాంకులు ఏర్పాటు కావడం సంతోషకరమని, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్‌లో యాక్సిస్ బ్యాంక్ నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకు శాఖను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, రాజు, సీనియర్ నాయకులు, రమేష్ గౌడ్, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి**

సంగారెడ్డి క్రైమ్: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి సూచించారు. ఈ మేరకు పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సరైన నంబర్ ప్లేట్, ఇన్సూరెన్స్, ఆర్సీ తదితర పత్రాలు లేకపోతే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే వాహన యజమానులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. అలాగే వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు. రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేయరాదని, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

◆ **చెక్కుల అందజేత**



జహీరాబాద్ టౌన్: స్థానిక నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.10,53,500 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని నివాస గృహంలో జహీరాబాద్, కోహీర్ మండలాలకు చెందిన 19 మందికి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ రాంలింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జమిలాలోద్దీన్, భీమయ్య, ప్రతాప్‌రెడ్డి, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సామాజిక సేవలో ముందుండాలి**

జహీరాబాద్ టౌన్: సామాజిక సేవలో యువత



ముందుండాలని ఆచార్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్ అన్నారు. కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌ఎస్ యూనిట్ వలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు జాతీయ జెండాలను పట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా జీవనశైలిలో మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మాధవి, డైరక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **పొరదేవి యాత్రకు దీక్షపరులు**

జహీరాబాద్ టౌన్: మండలంలోని సేడియా గుట్ట తండాకు చెందిన జగదాంబ మాత, సేవాలాల్ దీక్షపరులు బుధవారం మహారాష్ట్రలో ఉన్న పొరదేవి యాత్రకు బయలుదేరారు. ఈ మేరకు భవానీ మాత, సేవాలాల్ దీక్షదారులు పొరదేవిని దర్శించుకుంటారు.˘ ఇందులో భాగంగానే పూజారి రవి రాథోడ్ ఆధ్వర్యంలో 40 మంది భక్తులు బయలుదేరగా గిరిజనులు వీడ్కోలు పలికారు.

◆ **ప్రత్యేక పూజలు**

సంగారెడ్డి: చౌటకూర్ మండలం బొమ్మారెడ్డి గూడెంకు చెందిన గిరిజన దీక్ష మహరాజులు ప్రత్యేక పూజలు నిర్వహించి బోగ్ బండర్ నిర్వహించారు. అనంతరం భవాని మాత సేవాలాల్ మహారాజ్ మందిరానికి సంగారెడ్డి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోవర్ధన్ నాయక్, తండావాసులు సుధాకర్, నెహ్రూలు అందజేసిన కొబ్బరి చెట్లను అందజేశారు. ఈ మేరకు ఆలయం చుట్టూ కొబ్బరి చెట్లను నాటారు. అనంతరం పోరాదేవికి బయలుదేరారు. మహరాజ్‌లు దేవిదాస్ హెడ్మాస్టర్, రవీందర్ నాయక్, సురేందర్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్, రాజేందర్ గౌతమ్ తదితరులు ఉన్నారు.

◆ **మాతా శిశు సంరక్షణపై అవగాహన**

కల్హేర్(నారాయణఖేడ్): మండల కేంద్రంలో స్వస్త్ నారి స్వశక్తి పరివార్ కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్త్రీవైద్య నిపుణురాలు డాక్టర్ ఉమారాణి మాట్లాడుతూ.. అధిక రక్తపోటు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, రక్తహీనత, మధుమేహంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు, సాధారణ మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జేబ శహమీమ్, అనిల్‌రెడ్డి, సూపర్‌వైజర్ మానిక్యం పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం డీఎల్‌పీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు నిరసన చేపట్టారు. దసరా పండుగ వేళ నాలుగు నెలలుగా వేతనాలు అందక పూట గడవడమే కష్టతరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు బాలప్ప, తుకారాం, లాలయ్య, నర్సింహులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.